


ఊరివెలుపల బావి ఉన్నది
బావిదాపున తోట ఉన్నది
సంజవేళను చిన్నదానా
ఊయెలూగగ వత్తువా ?

ఈ పాట నాకు బాగా జ్ఞాపకం ఉంది. ఆ పాడే చిన్నవాడెవడో నాకు తెలుసు. ఆబావీ, తోటాకూడా నాకు తెలుసు. ఎందుకంటే ఆ ఊరే మా ఊరు. అక్కడే నే పుట్టి పెరిగాను. ఆ చిన్నవాని పాటకు జవాబుగా గాలిలో తేలి ఇంకో పాట వినబడేది.

ఊసుపోని చిన్నవాడా
ఊయెలూగిన పళ్ళురాలు !
పళ్ళురాలగ కూలి వచ్చి
ఒళ్ళు హూనము చేసిపోవు !.

ఆ చిన్నదాన్ని కూడా నే నెరుగుదును. నిండుజాబిల్లి లా నిగనిగ లాడుతూండేది. కోకిలలా పాడుతూండేది. పల్లెపడుచుల్లో ఆ చిన్నది ముత్తెం !

ఆ చిన్నవాడూ అందగాడు. నూనూగుమీసాల నూత్నయౌవనంలో నున్నవాడు. మంచివాడు. అతను తిరుగా ఇచ్చిన జవాబు:

కొంటెమారుల కోకిలమ్మా
ఒంటిగానను చేసిపోకు !
మింటికెగిరీ మబ్బుదరిని
చందమామతో ఆడరమ్మా !

ఆ చిన్నదీ, చిన్నవాడూ కలసి తోటలో ఊయె లూగేవారు; ఆటలు ఆడేవారు; పాటలుపాడేవారు. అయితే...?

ఇలా ఆలోచనలు దొర్లుకుపోతూన్నాయి. అంతలో ఆ బావి వచ్చింది. సెలవుకని మా ఊరువెళ్ళిన నేను అమృతంలాంటి ఆ బావినీటిని కడుపారా తాగాలని వెళ్ళుతూంటే గతించిన దృశ్యాలు సినిమాలా స్మృతి పథంలో దొర్లిపోసాగాయి.

కాని, బావిని చూసేసరికి ఆశ్చర్యమూ, విచారమూ కలిగాయి. అది పాడుపడిపోయింది. అందులోని నీరు ఎండిపోయింది. చూడ్డానికి భయంకరంగా ఉంది !

ఆ ఊరంతటి ప్రాణాన్ని నిలిపే ఆబావి ఎందుకిలా అయిపోయింది ? ఎందుకైతేనేం దాన్ని బాగుచేయించాలి. మళ్ళా అది అమృతం వర్షించేలా చేయాలి. ఆ ఉద్దేశంతో పనివాళ్లను పెట్టి మరునాడు అందులోనిమట్టిని పైకి తీయించసాగాను.

బావి చుట్టూ జనం మూగారు. పనివాళ్లు తట్టలతో మట్టిని బయట గిరాటేస్తూంటే పిల్లలు దాన్ని కెలక సాగారు ఏమైనా దొరుకుతాయేమోనని.

ఒక తట్టలోని మట్టిలో ఒకటి దొరికింది. దాన్ని చూసి పిల్లలు భయపడ్డారు. ఏమిటదోనని చూచేసరికి అది ఒక పెద్ద బాకు! బాకు—అవును! అది నూతిలోకి ఎలా వచ్చింది? ఆ బాకుపని అయిపోయిందా? అది ఎవరిది?

మళ్లా నా స్మృతిపథంలో గతించిన దృశ్యాలు కదిలాయి.

× × ×

ఒకనాడు—చంద్రుడు మెల్లిగా లేచి వస్తూన్నాడు. తోటలో చిన్నవాడు చెట్టెక్కి వేణువు ఊదుకుంటూ న్నాడు. అప్పుడుడప్పుడూ కళ్లు సారించి ఎవరికోసమో చూస్తూన్నాడు. ఎవరికోసమో అనడం ఎందుకు? అతని ఎదలో సుధలు చిలికే ఆ చిన్నదాని కోసమే! కాని, ఆ చిన్నది ఆ నాడు అతన్ని యుగాలు గడిపించేస్తూ న్నట్టు కనబడుతోంది. కాలాన్ని వెళ్లబుచ్చేందుకు అతను వేణువు ఊదుతూన్నాడు. అంతలో—

“చచ్చాను నాగన్నోయ్!” అన్న కేక వినబడింది. చిన్నవాడు వెంటనే చెట్టుమీద నిలుచుకుని ఆ కేక వచ్చిన వైపు చూశాడు. ఒక స్త్రీని ఒక మగాడు తడుముకుంటూ వచ్చి నూతివద్ద పట్టేసుకున్నాడు. మహాబలవంతుణ్ణనే గర్వంతో. కళ్ళు కానని కామంతో అలనాడు కీచకుడు అసహాయురాలైన ద్రౌపదిని వెంటాడిన దృశ్యం అతనికి జ్ఞప్తికి వచ్చింది. అమ్మోయ్! ఆ స్త్రీకంఠం అతనికి సుపరిచితమైనది! అతని కళ్ళు మసకబారాయి. భూమి తిరగసాగింది. తన చిన్నది— తన ప్రాణం—తన సర్వస్వం—సమాప్తమై పోతోంది! మరుక్షణం అతని కళ్ళు ఎఱ్ఱబారాయి. భృకుటి ముడుతలు పడ్డాయి. మెఱుపులా చెట్టుదూకి కీచకుని పైకి లంఘించి చిన్నదాని చేతిని విడిపించాడు. తనకు అడ్డెవ్వరని సవాలు చేసే కీచకుడు అనుకోని ఈ పరాభవానికి ప్రతిక్రియగా మొలనున్న బాకుతీసి చిన్నవాణ్ణి హతమార్చ జూశాడు. వెల్లువల్లోని సుడుల్లా తిరిగే చిన్నవాని బాణాకఱ్ఱ ఆ బాకును గట్టిగా దూరానికి విసరికొట్టింది. అది పల్లటీలు కొట్టుకుంటూపోయి నూతిలో పడి పోయింది!

నూతిలోని నీరు గిరగిరా తిరిగింది. సుడులు చుట్టి బుడగల్లేచి కొంతసేపటికి మళ్ళా ప్రశాంతమైపోయింది.

బాణాకఱ్ఱదాడికి తట్టుకోలేని కీచకుడు కాళ్లకి బుద్ధి చెప్పాడు!

× × ×

పనివాళ్లు మరో తట్టమన్ను కుమ్మరించారు. అందులో ఒక త్రాసు దొరికింది. అది తుప్పుపట్టి చిల్లులుపడి తెగిన తాళ్లతో పుచ్చినకఱ్ఱతో పేరుకున్నమట్టిని తొలగిస్తే వెకిలిగా నవ్వుతూన్నట్టు కనబడింది.

రాజ్యాలుపోయినా లక్షణాలుపోనట్టు అది ఆస్థితిలోకివచ్చినా దాని వికారాన్ని విడవలేదు!

“మన వెంకయ్యశెట్టిగారిదిలా ఉంది,” అన్నాడు జనంలోని ఒకడు.

“అదే అదే!” అన్నాడు ఇంకొకడు.

లక్షాధికారి వెంకయ్యశెట్టిగారిదైతే అది ఈబావిలో


# UNITED INDIA FIRE & GENERAL INSURANCE COMPANY LTD.

**Registered Office: 151, MOUNT ROAD, MADRAS-2**

Telephone: 81379 Telegram: "UNIGEN"

♦

**Regional Office: 9, BROADWAY, MADRAS-1**

Telephone: 21378/79 Telegram: "UNIGEN"

♦

*Branches:*

Indian: BOMBAY, CALCUTTA, NEW DELHI
and other important Cities.

Foreign: SINGAPORE, KUALA LUMPUR, PENANG, HONGKONG & KAMPALA (East Africa)

♦

*London Representatives:*

**Messrs. Muir Beddall & Company Ltd.,**

**37, Grace Church Street, London, E C. 3.**

M. Ct. MUTHIAH, *Chairman*

T. S. MUTHUSWAMI *General Manager*

కెందుకవస్తుంది? అతని ప్రాణానికి సమమై, అతని ఇంట్లోకి లక్ష్మిని ఆహ్వానించేతాళమై, అతని ఇంటికి దీపమైన ఆ త్రాసుకి అటువంటి దశ ఎందుకు వచ్చింది?

మళ్లా నా స్మృతిపథంలో గడించిన దృశ్యాలు కదిలాయి.

కాలికి బుద్ధిచెప్పిన కీచకుడు వెంకయ్యశెట్టిగారింట్లో తలకి కట్టుకట్టుకుని కొంచెం తేరుకున్నాక – అసాధులీడులా ఉన్నాడు శెట్టిగారూ! చావుతప్పి కన్నులొట్టపోయినంతపనయింది!" అన్నాడు.

"రంగారెడ్డీ! రౌడీరెడ్డి నువ్వుకావా? ఈ ప్రాంతాలవాళ్ళు నీ పేరు వింటే హడలిపోతారే! ఆ చిన్నవాడు నిన్ను ఎదిర్చి తిరగ్గొట్టాడా?" ఆశ్చర్యపోతూ అన్నాడు శెట్టిగారు.

"పిట్టకొంచెం, కూతఘనం!"

"కాదు. నీకు ఇంకా కావలసినంత డబ్బు ఇస్తాను, ఆ చిన్నవాడు నా వ్యాపారానికి అడ్డుతగలకుండా చూడు. అతను పోలీసుశాఖలో ఏదో పెద్ద ఉద్యోగం వెలగబెట్టుతూన్నానని విర్రవీగుతాడు. ఆ విర్రవీగుడు అణగగొట్టాలి."

"అది కుదరలా!"

"కుదిరి తీరుతుంది! అచ్యుతంగాడితోనే మాట్లాడుతా!"

"అదేమంచిది!"

నెలగడిచేసరికి నాగన్నకి, తెల్లటోపీ శ్రీమాన్ అచ్యుతంగారి ధర్మమా అని ఆ ఊరునుంచి బదిలీ అయిపోయింది! అతని స్థానంలో ఇంకొక ఉద్యోగి వచ్చాడు!

తరువాత ఒకనాటి రాత్రి—

చల్లగాలికి శెట్టిగారు మేడమీద నిద్రపోతూన్నారు. ఇనప్పెట్టెతాళం ఎవరో తెరుస్తూన్న అలికిడైంది. శెట్టిగారికి నిద్రాభంగమైంది. తలెత్తి చూశారు.

"కదిత్తే కాల్చేస్తా!" కాళరాత్రిలాంటి నల్లని రైఫిల్ గురిపెట్టి అన్నాడో ముసుగు మనిషి.

"మాట్లాడితే మరి ఈ భూమ్మీద నూకలుండవ్!" మెఱుపులా మెరుస్తుండే కత్తిని చూపెట్టి అన్నాడు మరో ముసుగు మనిషి.

కుక్కిన పేనులా సగం పోయిన ప్రాణాలతో అలానే ఉండిపోయారు శెట్టిగారు.

ఇనప్పెట్టె ఖాళీ అయిపోయింది. ఇంట్లోని విలువగల వస్తువులు ఎగిరిపోయాయి. తమపని జయప్రదంగా ముగించుకుని వెళ్లిపోయారు ఆ ముసుగు మనుషులు.

కాని—

వాళ్ళు ఊరుదాటి బావివైపునుంచి పోతూండగా అనుకోకుండా పోలీసు జీపు అటుగా వెళుతోంది. హెడ్‌లైట్లకాంతిలో ఆ కొత్తగా వచ్చినపోలీసు అధికారి వారిని పసిగట్టి ఛాలెంజి చేశాడు!

దొంగలు భయపడలేదు; పారిపోనూ లేదు; ఎటువంటి అఘాయిత్యానికీ పూనుకోనూలేదు!

"ఆగండి!" అనే సరికి ఆగిపోయారు.

పోలీసు అధికారి దగ్గరగా వచ్చి సంగతంతా తెలుసుకున్నాడు. దొంగలనాయకుడు అధికారిని కొంచెం ఎడంగా తీసుకుపోయి నిజం చెప్పాడు, అధికారికి అన్నీ బోధపడింది. మరుక్షణం జీపులో ఒక బరువైన మూట చప్పుడైంది.

Tel : " FRACTIONAL " Phone : 4909

- SIMPLE CONSTRUCTION.
- RELIABLE OPERATION.
- SILENT RUNNING.

S K M - Single Phase Motors.
S K P - Self Priming Centripetal Pumps.
S K M/S K P Unit Electric Pumping Sets.

EACH UNIT IS THOROUGHLY TESTED BEFORE DESPATCH.

FOR DETAILS
PLEASE CONTACT MANUFACTURERS :—

SREE KRISHNA FOUNDY

PAPANAICKENPALAYAM
COIMBATORE-1

నెమ్మదిగా జీపు కదిలిపోయింది. నిమ్మళంగా దొంగలు దారితీశారు. కసికొద్దీ తీసుకొచ్చిన శెట్టిగారి త్రాసును దొంగలు ఒక్క తాపుతన్ని ఆ నూతిలోకి విసరికొట్టారు.

నూతిలో నీరు గిరగిరా తిరిగింది. సుడులు చుట్టి బుడగల్లేచి కొంత సేపటికి మళ్లా ప్రశాంతమై పోయింది.

× × ×

పనివాళ్ళు మరికొంతమన్ను బయట వేశారు. అందులో విరిగినరాట్నం ఒకటి దొరికింది. అది మన ప్రాచీనులు సృష్టించిన పాతమోడల్ రాట్నం. అదే మహాత్మునికి ప్రాణం; మన స్వాతంత్ర్య సమరచిహ్నం; ఆ సమరం నాటి అమరగాథల్ని జ్ఞప్తికి తెచ్చి పరవశుల్ని చేసే దివ్య చిహ్నం. ఆ నాటి ఒక కథ:

ఒకమారు చంద్రశేఖర్ ఉదయం కొన్ని రొట్టెలూ, కొంచెం బెల్లం తెప్పించి తినసాగాడు. అవి అతను తినడానికి పనికిరావు. అయినా అతను తినసాగాడు. తినవద్దని అతని అనుచరులు వారించారు. అతను వినలేదు. సహచరులు బలాత్కారంగా అవిలాక్కుని విసరివేశారు. అవి ఒక మురికికాలువ దగ్గరపడ్డాయి, కాని చంద్రశేఖర్ వాటినే మళ్లాతీసుకొచ్చి అదితిని స్వాతంత్ర్యం కోసం బ్రిటిషు సింహాన్ని ఎదిర్చాడు!

"ఆ రాట్నం అచ్యుతంగారిది!" అన్నాడు ఒక వ్యక్తి.

"అచ్యుతంగారిదా!" ఆశ్చర్యపోయాను. నేను మళ్లా గతించిన దృశ్యాలు స్మృతిపథంలో పొర్లసాగాయి.

"బాబూ! కొండమునిగింది! దొంగలుపడ్డారు. ఇల్లు కొల్లగొట్టి పోయారు!" గోలపెట్టారు శెట్టిగారు అచ్యుతంగారి ముందు.

"పోలీసులకి రిపోర్టు చెయ్యలేదూ?" దిండుమీద చారబడుతూ భుక్తాయాసాన్ని తీర్చుకుంటూ అన్నారు అచ్యుతంగారు.

"చేశాం కాని, ఏం లాభం? ఆ నాగన్నగారి అంతటి నిజాయితీయపరుడూ, సాహసవంతుడూ అయితే ఇప్పుడున్న అధికారి?"

అచ్యుతంగారు వెకిలిగా నవ్వారు. "హుష్, ఇక గట్టిగా మాట్లాడకు! ఆ నిజాయితి అసలు నీకు ఉందా అంట? కొట్టులో నిండుగా సరుకు ఉన్నా లేదంటావు. సరుకులో చిత్తమొచ్చినది కలిపేసినా దివ్యమైనవంటావు ఎన్నివక్రమార్గాలు తొక్కి ఎంతగడించినా నీకు తృప్తి లేదు. ప్రజలబాధ నీకు కనుపించదు...అన్నారు·

"మీరే అలా అంటే ఎలా?!"

"అయితే ఊరుకో! ఇవి మన రోజులు కావు. ఈ ఎలక్షనులోను నేను నెగ్గితే మన పంట మళ్ళా పండింనుకో? కొంచెం చందా చెల్లించి వెళ్లు! అంటూ ఎయిర్ కండిషన్డు రూములో నిద్రపోయారు అచ్యుతంగారు. వడ్డీ చెల్లించి వచ్చేశారు శెట్టిగారు.

ఎలక్షనులు అయిపోయాయి. తెల్లటోపీ అచ్యుతంగారు తనే నెగ్గుతానని గట్టిగా అనుకొన్నారు. అతని అనునాయులూ అదే ఆశించారు. అందుకు అహోరాత్రులు పాటు బడ్డారు కూడా.

కాని...

కాని, అచ్యుతంగారి ప్రత్యర్థి గెలిచారు!

అలసిపోయినఅచ్యుతంగారి అనుయాయులలో ఒకరు నిద్రపోతూండగా పిల్లి గెంతుకి బల్లమీద ఉన్న ఆ రాట్నం అతని మీద పడింది. కోపంతో అతను దాన్ని తీసుకెళ్ళి ఆ నూతిలో విసరికొట్టి వచ్చేశాడు.

నూతిలోని నీరు గిరగిరా తిరిగింది. సుడులు చుట్టి బుడగల్లేచి మళ్లా కొంత సేపటికి ప్రశాంతమై పోయింది.

చీకటి పడింది. అంతటితో ఆ నూతి పని ఆపి ఇంటి ముఖం పట్టాను. ఆ నూతిలో ఇంకా ఎన్ని కథలు ఇమిడి ఉన్నాయో ఎవరికి తెలుసూ!




"ప్రేమ" స్టీల్ ఫర్నీచర్

* ఆఫీసు బల్ల. * స్ప్రింగ్ మంచం.
* సాధారణ మంచం. * పసిబిడ్డలఉయ్యాల.

అందమైన నగతుగల్గిన మంచం, మొదలైనవి.
(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

*

PREMA ENGINEERIG WORKS (P.B. No. 846) PEELAMEDU, COIMBATORE-4.